## పోచారం మున్సిపల్ చైర్మన్ పై కేసు నమోదు

ఘట్‌కేసర్, సెప్టెంబర్ 4: పోచారం మున్సిపల్ చైర్మన్ బి.కొండల్‌రెడ్డి పై కేసు నమోదైంది.ఈ మేరకు మండల ఇరిగేషన్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీలోని అన్నోజిగూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 87,88లో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉంది. అయితే చైర్మన్ కొండల్‌రెడ్డి చెరువు నీటిలో గతంలో దాదాపు ఒక వెయ్యి గజాల స్థలంలో మట్టిని పోసి బతుకమ్మ ఘాట్‌ను ఏర్పాటు చేశాడు. అప్పట్లో మట్టిని పోసే సమయంలోనే ఇరిగేషన్ అధికారులు అభ్యంతరం తెలుపగా చైర్మన్ పట్టించుకోలేదు. దీంతో స్థానిక ప్రజా ప్రతినిధులు కొందరు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం హైడ్రా ఆధ్వర్యంలో చెరువులు, కుంటల ఆక్రమణలను తొలగిస్తున్న నేపథ్యంలో ఈనెల 3న ఇరిగేషన్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఇరిగేషన్ ఈఏ పరమేశ్ తెలిపారు.

## తెలంగాణ పారాలింపిక్ సంఘం అభినందనలు

హైదరాబాద్, ఆట ప్రతినిధి : ప్రతిష్టాత్మక పారిస్ పారాలింపిక్స్‌లో కాంస్య పతకంతో మెరిసిన యువ పారా అథ్లెట్ జివాంజీ దీప్తిని రాష్ట్ర పారాలింపిక్ సంఘం ప్రత్యేకంగా అభినందించింది. మంగళవారం జరిగిన మహిళల 400మీ. టీ20 రేసులో మూడో స్థానంలో నిలిచిన దీప్తి కాంస్య పతకం గెలిచిన నేపథ్యంలో సంఘం గౌరవ అధ్యక్షుడు వీరయ్య, అధ్యక్షుడు సింగారపు బాబు, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, అంజన్‌రెడ్డి, ఇండియా డిజేబుల్ క్రికెట్ టీమ్ కెప్టెన్ ధీరావత్ మహేశ్ నాయక్ శుభాకాంక్షలు తెలిపారు. ఆమె విజయానికి తోడ్పడిన కోచ్ నాగపురి రమేశ్‌కు సంఘం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# జవహర్‌నగర్‌పై హైడ్రా ఆపరేషన్ షురూ..

### 50 అక్రమ నిర్మాణాలను గుర్తించాం
### త్వరలోనే చర్యలు తీసుకుంటాం
### హైడ్రా కమిషనర్ రంగనాథ్



అంబేద్కర్‌నగర్ ఇందిరమ్మ చెరువును పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్, తాసీల్దార్ సుచరిత, కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

జవహర్‌నగర్, సెప్టెంబర్ 4: చెరువులు, ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను సహించేది లేదని, ఎంతటివారైనా వదిలిపెట్టబోమని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని అంబేద్కర్‌నగర్ ఇందిరమ్మ చెరువు, డంపింగ్‌యార్డ్ చెరువు పరిసర ప్రాంతాల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ, మున్సిపల్ సిబ్బందితో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ.. జవహర్‌నగర్‌పై హైడ్రా ఆపరేషన్ షూరు చేసిందన్నారు. ఇందిరమ్మ చెరువులో పూర్తిగా అక్రమ కట్టడాలు చేయడంతో చెరువు నిండినప్పుడు ఇళ్లు సంపూర్ణంగా మునిగిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 50 అక్రమ కట్టడాలను గుర్తించామని త్వరలోనే తొలగిస్తామని కమిషనర్ పేర్కొన్నారు. డంపింగ్‌యార్డ్ చెరువులో నుంచి రసాయనాలు వదలడంతో కాలనీలోకి వచ్చి ప్రజలకు అనేక వ్యాధులు వస్తున్నాయని దమ్మాయిగూడ నాయకులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఇంటిని నిర్మించుకుంటే కావాలని కొందరూ అక్రమార్కులు బ్లాక్ మెయిల్ చేస్తూ, డబ్బులు డిమాండ్ చేస్తున్నారని.. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ మేయర్ మేకల కావ్య హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు విన్నవించారు. ఈ హైడ్రా కమిషనర్ వెంట కాప్రా తాసీల్దార్ సుచరిత, జవహర్‌నగర్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ఆర్వో ప్రభాకర్‌యాదవ్, మేనేజర్ నగేశ్, పలువురు నాయకులు ఉన్నారు.

## చెరువులను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు..

నేరేడ్‌మెట్, సెప్టెంబర్ 4 : నాలాలు, చెరువులను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. గౌతంనగర్ డివిజన్‌లో నాలాలపై అక్రమ నిర్మాణాలు ఉన్నట్లు ఫిర్యాదులు రావడంతో బుధవారం గౌతంనగర్ డివిజన్ మిర్యాలగూడ చిన్మయి మార్గ్ తదితర ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా రోడ్లను, నాలాలను ఆక్రమించుకొని నిర్మించుకున్న ఇండ్లను హైడ్రా కమిషనర్ రంగనాథ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో రంగనాథ్ మాట్లాడుతూ.. నాలాలు, చెరువుల్లో ఎలాంటి ఆక్రమణలున్నా..గుర్తించి తనకు నివేదిక ఇవ్వాలని సూచించారు.

## చెరువుల్లో ఇండ్లు నిర్మించిన వారికి నోటీసులు ఇవ్వండి

మేడ్చల్ కలెక్టరేట్, సెప్టెంబర్ 4: చెరువుల్లో ఇండ్లు నిర్మించిన ఇంటి యజమానులకు నోటీసులు అందజేయాలని హైడ్రా కమిషనర్ రంగానాథ్ అధికారులను ఆదేశించారు. దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలో ఉన్న దమ్మాయి చెరువును బుధవారం అధికారులతో కలిసి పరిశీలించారు. చెరువులో ప్లాట్లు చేసి అమ్మిన వారిపై కేసులు నమోదు చేస్తామని, చెరువుల్లో ఇంటి నిర్మాణాలు చేసిన వారికి నోటీసులు జారీ చేయాలని సూచించారు. చెరువులను పూర్తిగా కబ్జా చేసి ఇంటి నిర్మాణాలు చేయడంతోనే కొద్ది పాటి వర్షాలకు చెరువు నిండి దమ్మాయిగూడలోని పలు కాలనీలు మునిగిపోతున్నాయని మున్సిపల్ చైర్మన్ ప్రణీత శ్రీకాంత్ గౌడ్, కౌన్సిలర్ రమేశ్ గౌడ్, హైడ్రా కమిషనర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగమణి, టీపీఓ శ్రీదేవి, మేనేజర్ వెంకటేశం, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# హవ్వ.. హాస్టళ్లు గిట్లనా?

### వార్డెన్‌లపై కలెక్టర్ సీరియస్

- సంక్షేమ హాస్టళ్లు ఇలానే ఉంటాయా?
- మీరు ఏం చేస్తున్నారు?
- మీ ఇంట్లో ఇలానే ఉంటుందా?
- నిర్లక్ష్యంగా ఉన్న అధికారులకు నోటీసులు జారీ
- కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక



సిటీబ్యూరో, సెప్టెంబర్ 4 ( నమస్తే తెలంగాణ ) : హైదరాబాద్‌లో సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి దయనీయంగా మారుతోంది. హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. అసలే సీజనల్ వ్యాధులు ప్రబలుతుంటే హాస్టళ్ల అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. రోగాలకు కారణమయ్యే దోమలను నియంత్రించడానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ జిల్లాలో పర్యటిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. కానీ ఇదంతా సంక్షేమ హాస్టళ్లకు కనబడకపోవడం బాధాకరం. అంతేకాదు అవసరం లేకున్నా అదనపు సామగ్రిని తెప్పించుకొని గదిలో నిల్వ చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వస్తున్న క్రమంలో.. హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగానే ముషీరాబాద్ మండలంలోని జమిస్తాన్‌పూర్, అడ్డగుట్ట ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతి గృహాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహం పరిసరాలను పరిశీలించి స్టోర్ గదిని తనిఖీ చేశారు. చెత్త పేరుకుపోయి ఉండటాన్ని గమనించారు. ''ఇంత చెత్త ఏంటి? మీరు ఏం చేస్తున్నారు? మీ ఇంట్లో ఇలానే చెత్త ఉంటుందా? పరిశుభ్రం చేయించాల్సిన బాధ్యత లేదా?' అంటూ కలెక్టర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాదు స్టోర్ రూంలో లెక్కకు మించి ఉన్న కుక్కర్లు, బ్యాగులు, పప్పు దినుసులు, నూనె ప్యాకెట్లు తదితర మెటీరియల్‌ను గుర్తించారు. ఈ మెటీరియల్ మీ దగ్గర ఎందుకు ఉంది? వినియోగానికి అదనంగా ఉన్నప్పుడు అవసరమున్న మరో వసతి గృహానికి పంపించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రిజిస్టర్, కిచెన్ రూంలను పరిశీలించి పిల్లలకు సన్నబియ్యంతో భోజనం పెడుతున్నారా? లేదా? అని ఆరా తీశారు. నగరంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతుండటంతో పిల్లలకు జ్వరాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సంక్షేమ హాస్టళ్లలో పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిర్వహణ సరిగా చేయనందున జమిస్తాన్‌పూర్ హాస్టల్ సంక్షేమ అధికారి భానుప్రియ, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి శాంతి, ఏఎస్‌డబ్ల్యూఓ గట్టుమల్లుకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

## వ్యాధుల నియంత్రణకు చర్యలు

సిటీబ్యూరో : గడిచిన నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఆదేశాల మేరకు నగరంలో దోమల నివారణ, దోమలతో వ్యాప్తి చెందే వ్యాధుల నియంత్రణకు విస్తృతంగా చర్యలు చేపడుతున్నట్లు చీఫ్ ఎంటమాలజీ డాక్టర్ రాంబాబు తెలిపారు. నీటి నిల్వ కాలనీలను గుర్తించి డెంగీ, చికున్ గున్యా, మలేరియా లాంటి వ్యాధులు ప్రబలకుండా యాంటీ లార్వా ఆపరేషన్ ఫాగింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

## హ్యాబిట్ ఫార్మింగ్ డ్రగ్స్‌పై అవగాహన

సిటీబ్యూరో, సెప్టెంబర్ 4(నమస్తే తెలంగాణ) : ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా సామాన్యులకు హ్యాబిట్ ఫార్మింగ్ డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు ది తెలంగాణ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ప్రకటించింది. హ్యాబిట్ ఫార్మింగ్ డ్రగ్స్ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం, డ్రగ్స్ కంట్రోలర్ అథారిటీ (డీసీఏ) చేపడుతున్న చర్యలకు తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస్ తెలిపారు. రోగులకు రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ రాసిన ప్రిస్క్రిప్షన్ తీసుకువస్తేనే మందులను అందజేస్తామని పేర్కొన్నారు.



## అక్రమ నిర్మాణాల కూల్చివేత

మెహిదీపట్నం, సెప్టెంబర్ 4: కార్వాన్ నియోజకవర్గం లంగర్ హౌస్ డివిజన్ బాపూఘాట్ ఎదురుగా ఉన్న గాంధీనగర్‌లో చర్చి సమీపంలో ప్రధాన రోడ్డును ఆక్రమించి నిర్మించిన దుకాణ సముదాయాలను జీహెచ్ఎంసీ సర్కిల్ –13 టౌన్‌ప్లానింగ్ అధికారులు బుధవారం కూల్చివేశారు. రోడ్డును ఆక్రమించి నిర్మించిన దుకాణ సముదాయాలపై వచ్చిన ఫిర్యాదులతో కూల్చివేతలు చేపట్టామని ఏసీపీ విజయశ్రీ తెలిపారు. ఈ కూల్చివేతలను సెక్షన్ ఆఫీసర్ ప్రకాశ్ ఆధ్వర్యంలో సిబ్బంది పోలీస్ బందోబస్తుతో కూల్చివేశారు.

### అయోధ్యనగర్ కాలనీలో..

అనుమతులు లేకుండా అక్రమంగా పలు అంతస్తులు నిర్మించిన ఓ భవనంలో జీహెచ్ఎంసీ సర్కిల్–12 టౌన్‌ప్లానింగ్ అధికారులు బుధవారం కూల్చివేతలు చేపట్టారు. నాంపల్లి నియోజకవర్గం అయోధ్యనగర్ కాలనీలో ఓ భవనంలో అనుమతులు లేకుండా 4,5,6 అంతస్తులు నిర్మించారు. దీనిపై ఫిర్యాదులు అందడంతో కోర్టు అనుమతులను తీసుకున్న జీహెచ్ఎంసీ సర్కిల్ –12 టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. ఏసీపీ కృష్ణమూర్తి నేతృత్వంలో సెక్షన్ ఆఫీసర్ నర్సింగ్‌రావు, చైన్‌మెన్‌లు నర్సింగ్, మోహన్, సిబ్బందితో కలిసి కూల్చివేతలు పూర్తి చేశారు.

## పేదల ఇండ్లు కూల్చొద్దు..

### మేడ్చల్ కలెక్టర్‌కు ఎమ్మెల్యేల వినతి



వివిధ సమస్యలపై జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎంపీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

మేడ్చల్, సెప్టెంబర్ 4(నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ, ప్రైవేట్ పట్టా భూముల్లో 50 ఏండ్ల క్రితం ఏర్పాటైన కాలనీలు, బస్తీల్లో బడుగు, బలహీన వర్గాల ప్రజలు నిర్మించుకున్న ఇండ్లను కూల్చొద్దని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి, కేపీ. వివేకానంద్, మాధవరం కృష్ణారావు, బండారు లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. నిరుపేదలకు ఇచ్చిన నోటీసులను ఉపసంహరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

# హామీలను విస్మరించిన కాంగ్రెస్



మాట్లాడుతున్న రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తిక్‌రెడ్డి

మణికొండ, సెప్టెంబర్ 4: ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తిక్‌రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని పలుపునిచ్చారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని నార్సింగి గ్రామ క్రియాశీల కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పట్లోళ్ల కార్తిక్‌రెడ్డి హాజరై మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని, పార్టీ బలోపేతానికి పాటుపడాలన్నారు. ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, హామీలు నెరవేర్చకపోతే రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేస్తారన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటూ అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలను ఇంటింటికి తీసుకువెళ్లాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ ఆలీ, ఫారూక్, జితేందర్, ఆనంద్, సయ్యద్ ఖురేషి, ముస్తాఫా, ఆర్.నర్సింహ, డి.వెంకటేశ్ ముదిరాజ్, ఎం.నాగరాజు, జి.మహేశ్ ముదిరాజ్, ప్రియదర్శిని, సత్తార్‌ఖాన్, ఏ.గిరి, రమేశ్, బాబు, కె.చంద్రయ్య పాల్గొన్నారు.

# బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలి

### గాంధీ దవాఖానలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న సిద్ధేశ్వర్‌కు సంఘీభావం



ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న సిద్ధేశ్వర్‌ను పరామర్శిస్తున్న ఎంపీ లక్ష్మణ్, బీసీ నాయకులు

బన్సీలాల్‌పేట్, సెప్టెంబర్ 4 : కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. ఈ అంశం పై హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర్ పటేల్ చేస్తున్న ఆమరణ నిరాహార దీక్ష పదకొండో రోజుకు చేరుకుంది. గాంధీ దవాఖానలో దీక్ష చేస్తున్న సిద్ధేశ్వర్‌ను బుధవారం బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే.లక్ష్మణ్, మాజీ ఐఏఎస్ చిరంజీవులు, మాజీ డీజీపీ పూర్ణచందర్ రావు, బీఎస్పీ అధ్యక్షుడు ప్రభాకర్, సినీ నటుడు జైహింద్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నరేందర్ గౌడ్, భిక్షపతి గౌడ్, జయంతి, సోషల్ జస్టిస్ పార్టీ ఇన్‌చార్జి కే.వి.గౌడ్, అంబేద్కర్ ఆజాదీ సంఘం అధ్యక్షుడు నరహరి, కే.విజయ్‌కుమార్, అఖిలపక్ష నాయకులు పరామర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బీసీల ఆత్మగౌరవ సమస్యల పై సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కామారెడ్డిలో జరిగిన బీసీ డిక్లరేషన్ సభలో ప్రకటించిన విధంగా బీసీలకు 42 శాతం కోటా ఇచ్చిన తరువాతే.. స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. ఆరోగ్యం క్షీణిస్తున్నందున దీక్ష విరమించాలని నేతలు విజ్ఞప్తి చేయగా.. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు దీక్ష విరమించేది లేదని సిద్ధేశ్వర్ పటేల్ అన్నారు.

# కంటోన్మెంట్ బోర్డుకు అదనపు జలాలు.!!

### ఒక ఎంజీడీని పెంచుతూ జలమండలి నిర్ణయం
### కంటోన్మెంట్ సీఈవో, ఎమ్మెల్యే శ్రీగణేశ్ భేటీలో వివరాలు తెలిపిన ఎండీ అశోక్‌రెడ్డి



అధికారులతో భేటీ అయిన ఎమ్మెల్యే శ్రీగణేశ్

సిటీబ్యూరో, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ )/ మారేడ్‌పల్లి : కంటోన్మెంట్ బోర్డుకు అదనంగా ఒక ఎంజీడీ నీరు కేటాయించినట్లు ఎండీ అశోక్‌రెడ్డి వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేశ్‌తో పాటు కంటోన్మెంట్ బోర్డు ఉన్నతాధికారులతో ఆయన బుధవారం భేటీ అయ్యారు. కొంత కాలంగా కంటోన్మెంట్ ప్రాంతానికి సరిపడా నీరు సరఫరా కావడం లేదన్న విషయాన్ని ఎమ్మెల్యే శ్రీ గణేశ్ సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అదనపు నీటి సరఫరాకు విజ్ఞప్తి చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీగణేశ్, సీఈవో మధుకర్ నాయక్, సీఈ రాజ్‌కుమార్, ఉన్నతాధికారులతో జలమండలి ఎండీ సమావేశమై చర్చించారు. కంటోన్మెంట్ బోర్డు పరిధిలో సుమారు 40వేల నల్లా కనెక్షన్లు ఉన్నాయని ఎండీ అశోక్‌రెడ్డి తెలిపారు. వీరికి ప్రస్తుతం 5.9 ఎంజీడీల నీరు సరఫరా చేస్తున్నామని, అదనంగా ఏయే ప్రాంతాల్లో ఎంత నీరు సరఫరా పెంచే విషయం పై వారితో చర్చించారు. అదనంగా ఒక ఎంజీడీ నీటిని సరఫరా చేయనున్నట్లు తెలిపారు. దీంతో ఇక నుంచి కంటోన్మెంట్ ప్రాంతానికి మొత్తం 6.9 ఎంజీడీల నీరు జలమండలి సరఫరా చేయనుంది. ఇప్పటికే వారం రోజుల నుంచి 0.54 ఎంజీడీల నీరు అందిస్తుండగా..మిగిలిన 0.46 ఎంజీడీల నీటిని మరో మూడు నాలుగు రోజుల్లో సరఫరా చేస్తామని ఎండీ తెలిపారు. పంపిణీ వ్యవస్థతో పాటు నిల్వ సామర్థ్యం మెరుగు పర్చుకోవాలని, కంటోన్మెంట్ పరిధిలో ఉన్న అక్రమ నల్లా కనెక్షన్లపై సర్వే చేసి వాటిని రెగ్యులర్ చేసుకోవాలని సూచించారు. ఇన్‌లెట్‌ల వద్ద వాటర్‌ఫ్లో మీటర్లు ఏర్పాటు చేసుకోవాలని ఎండీ అశోక్‌రెడ్డి సూచించగా..కంటోన్మెంట్ బోర్డు అధికారులు అందుకు సుముఖత వ్యక్తం చేశారు.



## హెచ్‌సీయూలో 'బయో ఈ3' పాలసీ సదస్సు

కొండాపూర్, సెప్టెంబర్ 4: గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోసిస్ (సీడీఎఫ్‌డీ)ల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం వర్సిటీలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లో బయోఈ3 పాలసీపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హెచ్‌సీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్టార్టప్‌ల సవాళ్లు, అవకాశాలు, ఉద్యోగాల సృష్టి, పరిశ్రమల ఏర్పాటు తదితర అంశాలకు బయోఈ3 సొల్యూషన్‌గా ఉంటుందన్నారు. భారతదేశంలో బయోటెక్నాలజీ హబ్ ఉందని, ఇతర దేశాలను అధిగమించడానికి మెరుగుపడాలన్నారు. కార్యక్రమంలో సీడీఎఫ్‌డీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఉల్లాస్ ఎస్ కొల్తూర్, స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ ఆనంద్ కొండవి, ఆస్పైర్ –బయోనెస్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్ రాజగోపాల్, ఆర్ అండ్ డీ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ సామ్రాట్ సబత్ పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న ఓపెన్ డే కార్యక్రమం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ ఎం.విజ్జులత

సుల్తాన్‌బజార్,సెప్టెంబర్ 4: యూనివర్సిటీ క్యాంపస్ వాతావరణం ఎలా ఉంటుంది, అక్కడ ఏమేమి నేర్పుతారు అని తెలుసుకోవాల్సిన ఆసక్తి ఎందరిలోనో ఉంటుంది. ఆ దిశగానే కోఠిలోని తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ ఎం.విజ్జులత ఆధ్వర్యంలో బుధవారం వర్సిటీ వందేండ్ల వేడుకల్లో భాగంగా ఓపెన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీలోని 31 విభాగాల అధిపతులు తమ విభాగాల్లో కొనసాగే కార్యకలాపాలను ఎగ్జిబిట్ల రూపంలో ప్రదర్శించారు. ఈ ఓపెన్ డేను వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఎం.విజ్జులత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశ్వవిద్యాలయం క్యాంపస్ వాతావరణాన్ని తెలియజేయడంతో పాటు ఈ వర్సిటీలో భోదించే విధానాన్ని తెలిపేందుకు గాను అన్ని విభాగాల అధిపతులు ఎగ్జిబిట్లను ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ అధ్యాపకులు డాక్టర్ కేఎస్ఎన్ జ్యోతి, కృష్ణ, ప్రియాంక, లోకపావని, డాక్టర్ సునీత, డాక్టర్ నాజియాతో పాటు అన్ని విభాగాల అధిపతులు, విద్యార్థినులు పాల్గొ న్నారు.

## తప్పులు లేని ఓటరు జాబితాకు సహకరించాలి

### జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి



సిటీబ్యూరో : స్పెషల్ సమ్మరి రివిజన్–2025 ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాలో తప్పులు లేకుండా తయారు చేసేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి పేర్కొన్నారు. బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై సమావేశం నిర్వహించారు. జనవరి 1 , ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబరు 1వ తేదీ వరకు క్వాలిఫై తేదీ నాటికి 18 ఏండ్లు నిండిన ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని కమిషనర్ పేర్కొన్నారు. ఓటరు జాబితాలో తప్పుల సవరణ, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, పోలింగ్ స్టేషన్ సరిహద్దులు సరిచేసేందుకు బీఎల్ఓలు ఇంటింటి సర్వేను వచ్చే నెల 18వరకు పూర్తి చేయనున్నారు. సమగ్ర డ్రాఫ్ట్ రోల్స్, ఓటరు నమోదు, మార్పులు చేర్పులకు ఫారం1–8 తయారీ అక్టోబర్ 19 నుంచి 28 వరకు పూర్తి చేయనున్నట్లు కమిషనర్ చెప్పారు. జనవరి 6న జాబితా ప్రచురిస్తారని ఆమ్రపాలి తెలిపారు. ఆయా పార్టీల ప్రతినిధుల సూచనల మేరకు తప్పులు లేని ఓటరు జాబితాను తయారు చేస్తామని కమిషనర్ పేర్కొన్నారు.కార్యక్రమం లో బీఆర్ఎస్ ప్రతినిధి కృష్ణదాస్, ఎంఐఎం ప్రతినిధి సయ్యద్ ముస్తఫా, బీఎస్పీ ప్రతినిధి నరేందర్‌కుమార్, బీజేపీ ప్రతినిధులు వీఎస్ భరద్వాజ్, మర్రి శశిధర్ రెడ్డి, కే.పవన్‌కుమార్, సీపీఎం శ్రీనివాస్ రావు, కాంగ్రెస్ ప్రతినిధులు నిరంజన్, రాజేశ్‌కుమార్ పాల్గొన్నారు.

## పదోన్నతులపై న్యాయ విచారణ జరపాలి

### విద్యుత్ ఉద్యోగుల మహాధర్నా

సిటీబ్యూరో : విద్యుత్ ఉద్యోగుల పదోన్నతులపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విద్యుత్ బీసీ, ఓసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్పీడీసీఎస్, ఎన్పీడీసీఎల్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు బుధవారం విద్యుత్ సౌధలో మహాధర్నా చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి చైర్మన్ కోడెపాక కుమారస్వామి మాట్లాడుతూ... విద్యుత్ సంస్థల్లో కండీషన్ల పేరుపై కల్పిస్తున్న పదోన్నతులపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలన్నారు. ఈ ధర్నాలో ఎంపీ ఆర్ కృష్ణయ్య, కో చైర్మన్ ఆర్.సుధాకర్ రెడ్డి, కన్వీనర్ ముత్యం వెంకన్నగౌడ్, కో కన్వీనర్ సి. భాను ప్రకాశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేందర్, సోమయాజులు, ఎం.విజయ్‌కుమార్, పి.యాదగిరి, శ్రీనివాస్ పాల్గొన్నారు.






## మల్లారం నీటి శుద్ధి కేంద్రం పరిశీలన

సిద్దిపేట జిల్లాలోని మల్లారంలో ఉన్న తాగునీటి శుద్ధి కేంద్రాన్ని జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్, టెక్నికల్ డైరెక్టర్ రవికుమార్‌తో కలి పంప్‌హౌజ్ సబ్‌స్టేషన్‌ను బుధవారం పరిశీలించారు. నీటి శుద్ధిలో అవలంభించే పలు ప్రక్రియల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీజీఎం రవీందర్ రెడ్డి, జీఎం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

– సిటీబ్యూరో, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ )

## తొలి పూజ కోసం గవర్నర్‌కు ఆహ్వానం



ఖైరతాబాద్‌లో కొలువుదీరిన సప్తముఖ మహాశక్తి గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా వినాయకచవితి రోజు తొలి పూజకు హాజరు కావాలని కోరుతూ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఎమ్మెల్యే దానం నాగేందర్, ఉత్సవ కమిటీ చైర్మన్ సింగరి రాజ్‌కుమార్ నేతృత్వంలో ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. – ఖైరతాబాద్, సెప్టెంబర్ 4

## వరద బాధితులకు ఉద్యోగుల సహాయం



వరద బాధితుల సహాయార్థం ఒక్కరోజు మూల వేతనాన్ని సెప్టెంబర్ నెలలో నుంచి తీసుకోవాలని ఆర్థిక శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కను బుధవారం ఆయన కార్యాలయంలో రాష్ట్ర ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరు శ్రీనివాసరావు, జేఏసీ సభ్యులు ఏ.సత్యనారాయణ, డాక్టర్ ఎస్ఎం ముజీబ్‌హుస్సేనీలతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు బి.శ్యామ్, కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణ గౌడ్, చంద్రశేఖర్, పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

– సుల్తాన్‌బజార్, సెప్టెంబర్ 4